# లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో రహదారి భద్రత వారోత్సవాలు

**విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించిన ఆర్టీఓ అధికారి కిరణ్**





**అస్త్రం, కొండాపూర్ :** రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా లింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ శాఖ సిబ్బంది పాల్గొని పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు దాటేటప్పుడు జీబ్రా క్రాసింగ్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పనిసరిగా పాటించడం, వాహనాల్లో ప్రయాణించే సమయంలో హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ కిరణ్ మాట్లాడుతూ, చిన్న వయస్సులోనే రహదారి నియమాలపై అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న విషయాలను తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలియజేసి సమాజంలో రహదారి భద్రతపై చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రహదారి భద్రత వారోత్సవాల సందర్భంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ప్రజల్లో బాధ్యతాభావాన్ని పెంపొందిస్తాయని అధికారులు తెలిపారు.

## బొల్లారం పోలీస్ స్టేషన్ యధావిధిగా కొనసాగింపు ప్రజలకు భరోసా



అస్త్రం, బొల్లారం : ఐడిఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌ను యథావిధిగా కొనసాగించేందుకు అధికారులు అంగీకరించడం హర్షణీయమని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి అన్నారు. ఈ విషయంలో ఇటీవల నిర్వహించిన నిరసనకు స్పందించిన పోలీస్ శాఖ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.దబొల్లారం ప్రాంతంలో 350కు పైగా పరిశ్రమలు, సుమారు 70 వేల జనాభా, 25 కాలనీలు ఉండగా, గత 40 ఏళ్లుగా పోలీస్ స్టేషన్ ప్రజలకు సేవలందిస్తోందని ఆయన గుర్తు చేశారు. అనేక రకాల నేరాలు నమోదయ్యే ఈ ప్రాంతంలో పోలీస్ స్టేషన్ అవసరం ఎంతో కీలకమని, దానిని కొనసాగించేందుకు అంగీకరించడం ప్రజలకు ఊరట కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న జిన్నారం మాజీ ఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు వి. వేణుపాల్ రెడ్డి, బి. సంధ్య జైపాల్ రెడ్డి, టి. సాయి కిరణ్ రెడ్డి, బి. శైలజ పుండరికం, రూర్ బాలమణి, రత్నం బీరప్ప యాదవ్, మన్నే సతీష్ ముదిరాజ్, వి. శ్రీకాంత్ యాదవ్, ప్రభు నాయక్, మాజీ ఎంపీటీసీ యాదగిరి గౌడ్, నాయుడు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలకు కొలన్ బాల్ రెడ్డి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సందర్భంగా బొల్లారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మూల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, గతంలో మాదిరిగానే బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో కేసుల నమోదు, చట్ట పరిరక్షణ చర్యలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ విషయమై ప్రజల్లో ఎలాంటి అపోహలు అవసరం లేదని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా బొల్లారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని, పోలీస్ శాఖ ప్రజల భద్రతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని సీఐ భరోసా ఇచ్చారు. అవసరమైన సందర్భాలలో నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఆయన ప్రజలకు సూచించారు.

## వెనుజుల దేశం పై అమెరికా దాడిని ఖండించండి

**చిల్పూర్ సిపిఎం మండల కార్యదర్శి సాదం రమేష్**



**సామాన్యుడి అస్త్రం జనగామ** చిల్పూర్ మండల కేంద్రంలో సిపిఎం పార్టీ చిల్పూర్ మండల కార్యదర్శి సాదం రమేష్ మాట్లాడుతూ వెనిజులా దేశ అధ్యక్షుడు మదురోని అరెస్టు చేయడం అమెరికా ఉన్మాద చర్య,వెనుజులా దేశం యొక్క చమురు కోసం అమెరికా ఈ విధమైన దుస్సాహసం చేయడం ప్రపంచ దేశాలు నివ్వరాపోతున్నాయి. వెనిజులాపై యునైటెడ్ స్టేట్స్ యొక్క సైనిక దూకుడు మరియు బెదిరింపులను సిపిఎం మండల కమీటి తీవ్రంగా ఖండిస్తున్నాము. ఈ చర్యలు స్వతంత్ర దేశాలను అస్థిరపరచడం మరియు వాటి వనరులను నియంత్రించే లక్ష్యంతో జోక్యం చేసుకోవడమే. అమెరికా నియంతృత్వానికి వ్యతిరేకంగా నిలబడదాం. అని అన్నారు ఇట్లుసాదం రమేష్ సిపిఎం చిల్పూర్ మండల కార్యదర్శి

# పీజేఆర్ రోడ్ అపార్ట్మెంట్ వాసుల ఆగ్రహం

**'ఫ్యూచర్ సిటీ కాదుడ ముందుగా రోడ్లు, డ్రైనేజీలు ఇవ్వండి'**



**అస్త్రం, చందానగర్ :** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపుడి గాంధీ ఇప్పటికైనా పీజేఆర్ రోడ్ అపార్ట్మెంట్, కాలనీ వాసుల కష్టాలు వినాలని, వారి మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీ.ఆర్.ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. పన్నుల రూపంలో కోట్లాది రూపాయలు చెల్లిస్తున్నప్పటికీ కనీస రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నడూ లేని విధంగా తల్లులు, చిన్నపిల్లలు, వృద్ధులు సైతం రోడ్డెక్కి మౌలిక సదుపాయాల కోసం నిలదీయడం ఎమ్మెల్యే గారి కంటికి కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. "మాకు ఫ్యూచర్ సిటీ వద్దు ఉన్న నగరంలో కనీస సౌకర్యాలు కావాలి" అంటూ వేలాది మంది ప్రజలు రోడ్డుపైకి వచ్చి నిరసన తెలుపుతున్నా పాలకుల చెవికి ఈ స్వరం వినిపించడం లేదా? అని మండిపడ్డారు. చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తి శ్రీ నగర్, కేవీఆర్ ఎనక్లేవ్, గ్రీన్ ఫీల్డ్స్, అపర్ణ అపార్ట్మెంట్ వాసులతో కలిసి పీజేఆర్ రోడ్డును పరిశీలించిన మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి మాటల్లో మాత్రమే ఉందని, చేతల్లో మాత్రం ఎక్కడా కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు. వేలాది మంది ప్రజలు నిత్యం ప్రయాణించే పీజేఆర్ రోడ్డులో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడం పాలకుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. పన్నులు కడుతున్న దీప్తి శ్రీ నగర్, కేఎస్ఆర్ ఎనక్లేవ్, అపర్ణ, పీజేఆర్ రోడ్ పరిసర అపార్ట్మెంట్, కాలనీ వాసులకు రోడ్లు, డ్రైనేజీల సమస్యలు పరిష్కరించలేరా? అని ఎమ్మెల్యేను నిలదీశారు. ప్రజలు రోడ్డెక్కి వేలాది సంఖ్యలో ప్రశ్నిస్తున్నా పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతుండటం దురదృష్టకరమని అన్నారు. వెంటనే పీజేఆర్ రోడ్డులో కనీస సౌకర్యాలు కల్పించి, ప్రజల డిమాండ్‌కు తలవొగ్గి సమస్యలు పరిష్కరించాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం బీ.ఆర్.ఎస్ పార్టీ తరుపున గట్టిగా డిమాండ్ చేస్తున్నామని బొబ్బ నవత రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. సలీం, చందర్ రావు, గౌస్, శ్రీనివాస్ (బాబ్ల్యా), జె.వి. రావు, గణేష్ రెడ్డి, శోభ, చక్రవర్తి, రాజు, గంగాధర్, నగేష్ రెడ్డి, ఉపేందర్, వంశీ, శ్రీకాంత్, దుర్గ ప్రసాద్, శ్రీనివాస్, సునీత, శభనా, బాబా, అనంత రెడ్డి, మానస తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు



**జిల్లా ఆస్పత్రిలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ మెరుగైన వైద్య సేవలపై స్పష్టమైన ఆదేశాలు**

**సామాన్యుడి అస్త్రం అల్లూరి:** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల పట్ల మానవతా దృక్పథంతో స్పందించిన పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బాధితులను సందర్శించి పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ శేఖర్తో పాటు మరో పార్టీ కార్యకర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే ఆదివారం ఉదయం పాడేరు పట్టణానికి చెందిన కుడి చిట్టిబాబు, జి.మాడుగుల మండలం కులుపాడు గ్రామానికి చెందిన గసాడి ధర్మారావు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గాయపడి ఆస్పత్రిలో చేరారు. ఈ ఘటనలపై సమాచారం అందగానే ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదివారం ఉదయం జిల్లా ఆస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకొని, అత్యుత్తమ వైద్య చికిత్సలు అందించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని వైద్య అధికారులకు స్పష్టంగా సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్య సహాయం అందిస్తుంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ ధైర్యంగా ఉండాలి. వారి క్షేమమే మా బాధ్యత" అని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే పరామర్శతో బాధితులు, వారి కుటుంబ సభ్యులు భావోద్వేగానికి లోనై కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధిగా మాత్రమే కాకుండా, నాయకుడిగా ప్రజల కష్టసుఖాల్లో నిలిచే వ్యక్తిత్వాన్ని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మరోసారి చాటుకున్నారని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# సంయుత జన్మదిన వేడుకలు

**సామాన్యుడి అస్త్రం జనగామ** చిన్నారి కాసాల సంయుత 11వ పుట్టినరోజు సందర్భంగా ఆమె తండ్రి కాసాల సంతోష్ కుమార్ స్థానిక శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో నైవేద్యానికి 25 కిలోల సన్న బియ్యం అందజేశారు. ధనుర్మాసం సందర్భంగా దేవాలయానికి వచ్చే భక్తులకు వినియోగించనున్నారు. తన కుమార్తె పుట్టినరోజు సందర్భంగా దేవాలయంలో నైవేద్యానికి తన వంతు పాత్ర ఉండడం సంతోషంగా ఉంది అని తెలిపారు. నా కూతురు జన్మదిన రోజున ఈ సేవ చేయడం ఆనందంగా ఉంది" అని కాసాల సంతోష్ కుమార్ తెలిపారు. శ్రీ ఉమామహేశ్వర దేవాలయం అయ్యగారు సాంబమూర్తి శర్మ గారు కాసాల సంయుత కు శ్రీ ఉమామహేశ్వర స్వామి పూజ అనంతరం ఆశీర్వాదం ఇవ్వడం జరిగింది.



## శేరిలింగంపల్లిలో ఏఐఎస్ఎఫ్ బలోపేతం

**- వివిధ కళాశాలల విద్యార్థుల భారీ చేరికలు**

**- విద్యార్థుల సమస్యలపై నిరంతర పోరాటానికి సంకల్పం**



**అస్త్రం, శేరిలింగంపల్లి :** అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) శేరిలింగంపల్లి మండల కౌన్సిల్ ఆధ్వర్యంలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు భారీ సంఖ్యలో ఏఐఎస్ఎఫ్‌లో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టీ. రామకృష్ణ, సీపీఐ శేరిలింగంపల్లి నియోజకవర్గ కార్యదర్శి కె. చందూ యాదవ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ శేరిలింగంపల్లి మండల అధ్యక్షుడు టీ. నితీష్, కార్యదర్శి జె. ధర్మ తేజ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలో విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని, వాటి పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు దుస్థితిలో ఉన్నాయని, వాటిని వెంటనే బాగుచేసి అవసరమైన చోట్ల కొత్త భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం, తాగడానికి స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేశారు. తరగతి గదుల్లో సరిపడా బెంచీలు, బోర్డులు, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని, చదువు చెప్పే ఉపాధ్యాయుల సంఖ్యను తక్షణమే పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల కోసం టాయిలెట్లు పూర్తిగా బాగుచేసి, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, 24 గంటలు నీటి సదుపాయం కల్పించాలని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాల భవనాలకు కొత్త రంగులు వేసి, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, విద్యాశాఖకు తక్షణమే పూర్తి స్థాయి మంత్రిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటం ఆడొద్దని హెచ్చరిస్తూ, విద్యార్థుల సమస్యలకు న్యాయం జరిగే వరకు ఏఐఎస్ఎఫ్ నిరంతర పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ కార్యకర్తలు పాల్గొని సంఘానికి మద్దతు ప్రకటించారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ పోరాటం మరింత ఉధృతంగా కొనసాగుతుందని నేతలు తెలిపారు.


## శ్రీరామ్ నగర్ సి బ్లాక్‌లో అభివృద్ధికి మరో అడుగు



**అస్త్రం, కొండాపూర్ :** కాలనీ సంక్షేమ సంఘ కార్యాలయాన్ని ప్రారంభించిన అరెకపూడి గాంధీ శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ సి బ్లాక్లో నూతనంగా నిర్మించిన కాలనీ సంక్షేమ సంఘ కార్యాలయాన్ని గౌరవ ప్రజా ఖాతాల కమిటీ చైర్మన్ అరెకపూడి గాంధీ గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, ఉప్పలపాటి శ్రీకాంత్ గార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరెకపూడి గాంధీ గారు మాట్లాడుతూ, శ్రీరామ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం ఎంతో ఆనందదాయకమని తెలిపారు. ఈ కార్యాలయాన్ని కాలనీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు కేంద్రంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశాలు, సభలు, చిన్న కార్యక్రమాలు, జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు అనుకూలంగా కార్యాలయాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు. కాలనీ అభివృద్ధికి తన వంతు బాధ్యతగా నిరంతరం కృషి చేస్తానని, అవసరమైన చోట మరిన్ని నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. కాలనీలో ఏ చిన్న సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు. శ్రీరామ్ నగర్ సి బ్లాక్ కాలనీని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి, ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దడం జరిగిందని, ప్రస్తుతం ఇది మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చెందిన కాలనీగా నిలిచిందని తెలిపారు. శేరిలింగంపల్లి డివిజన్‌తో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కూడా శాయశక్తులా కృషి చేస్తానని అరెకపూడి గాంధీ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్హత ఉన్న మైనార్టీలకు మొదటి ప్రాధాన్యత ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

**మైనార్టీ ఆవాజ్ జిల్లా కార్యదర్శి ఎండి అజారుద్దీన్**



**సామాన్యుడి అస్త్రం జనగామ** జనగామ పట్టణంలో ఆదివారం బీరప్ప గడ్డ ప్రాంతంలో ఆవాజ్ పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ఆవాజ్ కమిటీ సభ్యురాలు నుస్రత్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎండి అజారుద్దీన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ అర్హులైన మైనార్టీ కుటుంబాలకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి మరియు వారికి జీవనోపాధి కింద కుట్టు మిషన్లు మరియు మైనార్టీ లోన్స్ ఇవ్వాలని అన్నారు ఈరోజు వెనుకబడిన తరగతులలో చదువు కోసం మరియు ఉపాధి కోసం అనేకమంది షాపులలో బీడీలు చేస్తూ కుటుంబాలను పోషించుకుంటూ పనిచేసుకుంటున్నారు కాబట్టి వారికి జీవనోపాధి కింద ప్రభుత్వము లోన్స్ ఇచ్చి ఆదుకోవాలని వారు అన్నారు లేకపోతే మైనార్టీలను ఐక్యం చేసి ఆందోళనలు పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఎండి సుల్తానా ఎంబి రహిమ ఎండి అంజుమ్ తదితరులు పాల్గొన్నారు

